
# ఉమెన్సు కాలేజి




శ్రీమతి
పరిమళా సోమేశ్వర్

ఆ సంవత్సరమే ఎమ్మెస్సీ పాసై ఫలితాలు తెలిసిన తరువాత రెండు నెలలకు ఉద్యోగంలో చేరేను. స్త్రీల కళాశాలలో లెక్చరర్‌గా అప్పాయింట్ అయినానని విని ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యేను కాసేపు. అసలే విద్యార్థినిగా ఉండే రోజుల్లో చాలా కష్టపడి చదివి, మంచి మార్కులు తెచ్చుకుని, ఉపాధ్యాయుల మెప్పు కోసం ప్రాకులాడే మనస్తత్వంగల దాన్నవడం వల్ల

యింకా అప్పటికి నాలో "స్టూడెంట్ మెంటాలిటీ" పోలేదు. అందువల్ల కాలేజీలో చేరిన మొదటిరోజున జాయినింగ్ రిపోర్టివ్వటానికి ప్రిన్సిపాల్ రూములోకి అడుగు పెడ్తూనే నా కాళ్లు గజగజ వణికినయ్. కుర్చీకి నిండుగా, కొద్ది క్షణాలలో లేడి పిల్లపై లంఘించబోయే ఆడపులి భంగిమలో కూర్చున్న ప్రిన్సిపాల్ — మిసెస్ చూడామణీ అయ్యంగార్‌ని చూస్తూనే హడలిపోయేను. ఎలాగో ధైర్యం తెచ్చుకుని, అతి ప్రయత్నంమీద మాటలను కూడదీసుకుంటూ నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

ఆవిడ నా పేరు వింటూనే ముప్పై రెండు పళ్లూ బయటపడేలా ముఖం రెట్టింపు వెడల్పు సాగేలా నవ్వుతూ, చెయ్యి చాచి కూర్చోమంది కుర్చీ చూపిస్తూ.

"ఫరవాలేదు. ఈ ప్రిన్సిపాలు చూట్టానికి భయంకరంగా ఉన్నా మనిషి మంచిదిలానే ఉంది. బాబాయి పనిచేసే కాలేజీ ప్రిన్సిపాలైతే లెక్చరర్లకెవరికీ సీట్ ఆఫర్ చెయ్యడట. ఎంతసేపు ఆయనతో మాట్లాడవలసి వచ్చినా వాళ్ళకు నిలువు కాళ్ళ జెరమే గతిట. ఎంతైనా యీవిడ స్త్రీ కదా. అందునా వెన్నలాంటి గుండెకు పువ్వులాటి మనసుకి ప్రసిద్ధిగాంచిన భారత స్త్రీ అయ్యె—"అలా ఆ రెండు క్షణాల్లోనే ఆవిడను గూర్చి సదభిప్రాయాన్ని ఏర్పరచుకుంటానికి ప్రయత్నిస్తూ కూర్చున్నాను నేను.

నా అప్పాయింట్‌మెంట్ ఆర్డర్సు ఆవిడ చేతి కిచ్చేను.

ఆవిడ కళ్ళజోడు తీసి, టేబులుమీద పెట్టి, కళ్లు రెండూ చికిలించి కాగితాన్ని ముఖానికి దగ్గరగా పెట్టుకుని చదువుతుంటే, మళ్ళీ నా బుర్ర చురుకుగా పని చెయ్య సాగింది. "ఈవిడ అసలు కళ్ళజోడు ఎందుకు పెట్టుకున్నట్టు? నాకున్న ఫిజిక్సు పరిజ్ఞానాన్నిబట్టి, హ్రాస్వ దృష్టి గలవారూ, వయసు మళ్ళి చత్వారం వచ్చిన మనుషులూ కళ్ళజోడు పెట్టుకుంటారనీ,దానివల్ల వారికి సరియైన దృష్టి లభిస్తుందనీ నా అభిప్రాయం. ఈవిడ వయసు చూస్తే ఏభై దగ్గరలో పడుతున్నట్లుగా ఉంది.అంటే అది తప్పకుండా చత్వారం జోడే అయి వుంటుంది. ఐతే యీవిడ దృష్టి లోపం గల వారందరి పాలిట కల్పతరువులా కనిపెట్టబడిన యీ జోడును తగిలించుకోకుండా, పైగా ఉన్నజోడును కూడా తీసివేయటంలోని అంతరార్థ మేమిటి? ఈవిడ కళ్ళ జబ్బు మరో కొత్త జాతికి సంబంధించినది కాదు కదా?" అలా సాగిపోతున్నాయ్ నా ఆలోచనలు.

ఆర్డర్సు చదవటం పూర్తి చేసి, "అన్నట్టు మీ పేరేమిటి? మిస్ రాధ కదూ? మీరు ఆఫీసులోకి వెళ్ళి, జాయి

వింగ్ రిపోర్టుతో పాటు అవసరమైన సర్టిఫికేట్లను కూడా సబ్మిట్ చెయ్యండి," అని కంచు కంఠంతో ఇంగ్లీషులో అని, తక్కిన మరో ఫైల్లోకి తల దూర్చింది మిసెస్ చూడామణీ అయ్యంగార్.

"అంటే అర్థం, 'ఇక వెళ్ళిపోవచ్చు' నని అన్నమాట!" అని స్వగతంలో అనుకుని, లేచి, ఆవిడ నా వంక చూడక పోయినా, ఆవిడ వైపుకు ఒక నమస్కారం విసిరేసి బయటపడ్డాను.

నేను ఉద్యోగంలోకి చేరబోయే ముందు అధికార మనస్తత్వాన్ని గూర్చి, వారి యెడల చూపవలసిన ప్రవర్తనను గూర్చి విపులీకరిస్తూ ఓ చిన్న ఉపన్యాసం యిచ్చేడు బాబాయి. పై అధికారి కెప్పుడూ తన క్రింది ఉద్యోగస్తులు ఒదిగొదిగి నమస్కారాలు చెయ్యాల అన్న కోరిక గాఢంగా ఉంటుందనీ, కాని ఆ కోరికను బహిరంగంగా వెల్లడించటానికి సభ్యతా, సంస్కారం అడ్డు వస్తాయి కనుక, వారి వినయ విధేయతలను గూర్చి పట్టించుకోనట్లే నటిస్తారనీ, ఐతే మరో వంక వీరు తమని గౌరవిస్తున్నారా, లేదా అని ఓరకంట కనిపెడుతూనే ఉంటారనీ, కాబట్టి ముందు చూపున్న ఉద్యోగస్తులందరూ పై అధికారి మెప్పును పొందటానికి శాయశక్తులా ప్రయత్నిస్తుండాలనీ బాబాయి చెప్పిన విషయాల్లో ముఖ్యమైనవి.

అందువల్ల, ఆవిడ నా వంక చూడక పోయినా, ముడుపు చెల్లించుకున్నట్టు నమస్కారం చేసి యివతలకు వచ్చేసేను.

ఆఫీసులో పని అయినాక ప్యూన్ సహాయంతో స్టాఫ్ రూముకు వెళ్లేను.

రూములోకి వెళ్లుతూనే ఒక మూలగా కుర్చీలో కూర్చున్నాను నేను బిడియంగా. నిన్న మొన్నటిదాకా విద్యార్థినిగా ఉండి ఇప్పుడు వాళ్ళందరి ముందూ వారితో సమానమైన హోదాలో కూర్చుంటానికి సిగ్గనిపించింది నాకు.

కాని వెంటనే, "పుట్టగానే యెవరైనా ఉద్యోగస్తులౌతారా? వీళ్లు కూడా ఒకప్పుడు నాలా విద్యార్థినులుగా ఉన్న వారే కదా! ఇప్పుడంటే దాబుగా తిరుగుతున్నారు కాని, వీళ్లు కూడా ఉద్యోగంలో చేరిన మొదటి రోజున నాలానే ఫీలై ఉండివుంటార్లే!" అని నాకు నేను సమాధానం చెప్పుకుని, కొంచెం ఠీవిగా కూర్చోవటానికి ప్రయత్నించేను.

ఐతే నాకు ఇబ్బంది కల్గించిన మరో విషయ మేమంటే, నాకు 'పర్సనాలిటీ' లేదు. సన్నగా, పొట్టిగా ఉన్న నేను, యించుమించు ఐదడుల నాల్గంగుళాల పైన ఎత్తులో ఉన్న వాళ్ళందరి ముందూ నిల్చుంటే ఎంతో చిన్నగా కనిపిస్తాను. తోటి ఉద్యోగస్తుల ముందు, కనీసం ఆకారంలోనైనా, చిన్నగా కనపడటం నాకు ఏమాత్రం రుచించలేదు.

వాళ్లందరూ నా వంక ఓర చూపులు

విసుర్తూ, అటూ యిటూ తిరుగుతూనే నన్ను నఖశిఖ పర్యంతం క్షుణ్ణంగా పరీక్ష చేసేరు. "ఎవరో కొత్త కాత్తీలా వుందే!" అన్న భావం వారందరి ముఖాల్లోనూ స్పష్టంగానే కనిపించింది నాకు.

వాళ్ళ నెలా పలకరించాలా అని ఆలోచిస్తుండగానే ఒకామె నా దగ్గరకు వచ్చి, "మీది యే డిపార్టుమెంటు?" అనడిగింది. చెప్పేను. తరువాత నేను ఎమ్మెస్సీ ఏ యూనివర్శిటీ నుండి చేసిందీ, ఎక్కడుండేదీ, మొదలైన వివరాలన్నీ అడిగి తెలుసుకుంది. ఆవిడ పేరు శకుంతలట. ఆమె కూడా నాలాగే ఫిజిక్సు లెక్చరర్. మిగతా వాళ్ళందరితో పోల్చి చూస్తే శకుంతల వేషధారణలో, మాటతీరులో నిరాడంబరంగా వుంది. పైన ఆవిడ మాటలలో, ప్రవర్తనలో కృత్రిమత్వం కన్న ఎక్కువగా స్నేహభావం నిష్కాపట్యం కనిపించినయ్. ఆవిడకు యిద్దరు ఆడపిల్లలుట. వయసు షుమారు ముప్పై వుంటుంది.

మే మిద్దరం మాట్లాడుతుండగానే ఉన్నట్టుండి అక్కడున్న వారందరిలోనూ గొప్ప కలకలం బయల్దేరింది.

"ఓ!"

"హాల్లో!"

"యూ—ఫాతిమా!"

"ఆఫ్టర్ సోలాంగ్!"

"హౌ డి యు డూ?"

మొదలైన స్వాగత వాక్యాలు వింటూనే అవి వుద్దేశింపబడిన వ్యక్తి వైపుకు చూసేను నేను.

ఆమె మిస్ ఫాతిమా బేగమ్—ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తోందిట—శకుంతల చెప్పింది నాకు.

ఫాతిమా అసలు ఎత్తు ఐదడుగుల ఆరంగుళాల వరకు వుంటుంది. ఆవిడ హేర్ స్టయిల్‌తో కూడా కలిపి, షుమారు ఆరడుగుల ఎత్తులో కనపడుతోంది. ఆమె అలంకరించుకున్న పద్ధతిని ఆపాదమస్తకం పరీక్షించాలంటే ఎవరికైనా కనీసం అరగంట టైం పడుతుంది. ఐతే ఆవిడ అంత శ్రద్ధగా, ఓపికగా అలంకరించుకుంటానికి యింటి దగ్గర ఎన్ని గంటల సమయాన్ని వినియోగించి వుంటుందో అంచనా వేస్తున్నాను నేను.

ఫాతిమా గదిలోకి అడుగుపెట్టగానే, ఏ ఒకరిద్దరో తప్ప, అంతా కుర్చీల్లో నుండి లేచి పరిగెత్తారు ఆమె వైపుకు.

ఒకామె ఫాతిమా బుజాలు సున్నితంగా తాకింది.

మరొకామె ఆమె చీరకొంగును చేతిలోకి తీసుకుంది.

ఇంకొకామె ఫాతిమా ఎడమ చేతిని పట్టుకుని, దాని అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్న వాచీనీ, దాని స్ట్రాప్ స్థానంలో ఉన్న బంగారు కడియాన్నీ మృదువుగా స్పృశించసాగింది.

ఒకామె ఆవిడ చీర కుచ్చిళ్ళను చను




వుగా సర్దుతున్నట్లు ముట్టుకుంది.

ఫాతిమా రాకకు తమ సంతోషాన్ని వివిధ రకాలుగా వెల్లడించుకున్నారంతాను.

"ఎన్నాళ్ళయింది నిన్ను చూసి!"

"కొంచెం నల్లపడ్డావు...యీ పది రోజుల్లోనే!"

"అరె! హేర్ పిన్ను ఊడిపోతోంది యీ పక్క" తలలోని పిన్నును ప్రేమగా సర్దింది ఒకామె.

"ఈ చీర బొంబేలోనే కొన్నావా?"

"ఎంత చార్మింగ్‌గా ఉందో దీని కలరు!"

"నువ్వెప్పుడూ నీ రంగులో కలిసిపోయే చీరలనే సెలెక్ట్ చేసుకుంటావు!"

"ఓ! స్లిప్పర్సు కూడా కొత్తవేనే!"

"అబ్బ! ఎంత బాగున్నాయో! దీని ఖరీ దెంత?"

"అన్నట్లు బొంబే కబుర్లేమిటో చెప్పనేలేదు."

ఇలా ఆవిడను తమ ఆదరాభిమానాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే ఫాతిమా అందంగా, సుతారంగా నవ్వుతూ, మరింత ఠీవిగా, దర్పంగా నిల్చుని సమాధాన మివ్వసాగింది.

పది నిమిషాలపాటు అలాగే, బెల్లం

చుట్టూ మూగిన యీగల్లా, ఆమెను పట్టుకుని వేళ్ళాడిన వాళ్ళంతా, ఆమె "ఇంక వస్తాను. పనుంది," అంటూ వెళ్ళిపోగానే తిరిగి తమ స్థానాల్లోకి వచ్చి కూర్చున్నారు.

ఒక్క నిమిషంపాటు అసహజమైన నిశ్శబ్దం అలముకొంది ఆ గదిలో.

ఉన్నట్టుండి కిచకిచ మంటూ నవ్వింది ఓకామె.

ఆమె నవ్వుతో తమకి కూడా నవ్వటానికి ధైర్యం వచ్చినట్లు మరో నలుగురైదుగురు కూడా పకపక నవ్వేసేరు.

"చూసేవా, నళినీ! ఆ ఫాతిమా చూడు. దాని వేషం అదీనూ!'!' అతిగా నవ్వలేక పొట్ట చేత్తో పట్టుకుంటూ అంది ఒకామె.

"అచ్చు స్టేజి మీదకు వెళ్ళబోయే నాటురకం నాటకాల హీరోయిన్‌లా ఉంది!"

ఆ కామెంట్‌కి అందరూ ఆ గది గోడలు దద్దరిల్లేలా నవ్వేరు.

"ఇంక బాంబే కూడా పోయొచ్చింది కదా. రేపట్నుండి రోజుకో వేషం వేస్తుంది, చూడు."

"ఇప్పుడు వెయ్యకపోతేనా?"

"దాని బోయ్ ఫ్రెండ్—రాబర్ట్ ఏమయ్యాడో! ఈ మధ్య కనపట్టం లేదూ!"

"మరో జేమ్స్ బాండ్ దొరికి ఉంటాడు."

"ఛ! అదేమిటి? రాబర్ట్తూ, తనూ పెళ్ళి చేసుకోబోతున్నామని చెప్పిందిటగా మిసెస్ వైదేహితో!"

"అంతకు ముందోసారి అమీర్‌ని గాఢంగా ప్రేమిస్తున్నానని కూడా చెప్పింది."

"ఐనా మన కెందుకులే అలాటి విషయాలన్నీ? అలాటివాళ్ళ బ్రతుకులు అలాగే తెల్లవారుతయ్!"

ఇంతలో బెల్లయేసరికి చాలామంది క్లాసులకి వెళ్ళటం, అంతకు క్రితం పిరియడ్ క్లాసు తీసుకుంటానికి వెళ్ళినవాళ్లు తిరిగిరావటం జరిగింది. ఆ సందడిలో ఫాతిమా సంగతి వెంటనే మర్చిపోయేరందరూ.

నా కళ్ళముందు ఫాతిమా అనబడే ఆవిడ యెడల వారు చూపిన ఆదరాభిమానాలనూ, ఆమె వెనుక ఆవిడను గూర్చి వదిలిన పూటు విమర్శలనూ— యీ రెంటినీ సమన్వయించుకోలేక దిమ్మ తిరిగిపోయేను నేను.

శకుంతల నా కళ్ళలోకి చూస్తూ చిన్నగా నవ్వింది, "భయపడకు. అదంతే!" అన్నట్టు.

క్రమంగా మరో పదిరోజులు గడచేసరికి నాకు కొంచెం బెరుకు తగ్గింది. కాలేజీ వాతావరణాన్ని కొంతవరకు స్థూలంగా అర్థం చేసుకున్నాను. శకుంతల ఆ పదిరోజులలోనే నాకు చాలా సన్నిహితురాలయింది. దానికి చాలావరకు

శకుంతల స్వభావమే కారణం. అదీ కాక మే మిద్దరం కూడా ఒకే డిపార్టుమెంటు వాళ్ళం కనుక ఎప్పుడూ కలసే ఉండే వాళ్ళం. శకుంతల చాలా కలుపుగోలు మనిషి. ముఖ్యంగా నాలాటి బిడియస్తు లను మాటల్లోకి దించి, మంచి చేసుకో కల నేర్పు ఆవిడలో బాగా వుంది. ఆవిడతో స్నేహం చేసిన వాళ్ళెవరూ ఆవిడను ప్రేమించకుండా వుండలేరు.

ఐతే శకుంతలలో నాకు నచ్చని గుణాలు రెండు కనిపించినయ్.

ఒకటి—ఆవిడ అస్తమానం తన ఇంటి గొడవలే చెప్తుండేది. తన భర్తకి ఏ కూర యిష్టమైనదీ, ఏ రకం సినిమాలు చూసేదీ, పిల్లలెలా అల్లరి చేసేదీ, తా మిద్దరూ బయటకు వెళ్ళేక ఆయా పిల్లల్ని ఎలా కష్టపెట్టేదీ, వాళ్ళ కోసం యిచ్చిన పాలూ, బిస్కట్లూ అది ఎలా మింగేసేదీ వివరాలన్నీ చెప్పుకొచ్చేది. మొదట్లో సానుభూతిగా విన్నా, రాను రానూ ఆవిడ ధోరణికి నాకు భోర్ కొట్ట సాగింది.

తన పిల్లల ముద్దు ముచ్చట్లు, శ్రీవారి అభిరుచులూ తనకి కలిగించినంత ఆనం దాన్నీ, ఆసక్తినీ యితరలకు కలగనీవనీ, తన పిల్లలకు వచ్చే జబ్బులు, ఆయా వల్ల వాళ్ళు పడే కష్టాలూ తనకి కలిగించినంత బాధ యితరులకు కలగనీవనీ ఆవిడ గ్రహిస్తే బాగుండు ననుకునే దానిని. వినా అవిడమీాద వున్న గౌరవం కొద్దీ, 'యిష్టం లేకపోయినా, ఆవిడ చెప్పే విషయాలన్నీ ఎంతో ఆసక్తిగా వింటు న్నట్టు నటించే దానిని.

ఇక, ఆవిడలో నాకు నచ్చని రెండవ విషయ మేమంటే, ఆవిడ పెద్దగా ఆవ లించేది. మాట్లాడుతూ మాట్లాడుతూనే నోరంతా తెరిచి బిగ్గరగా ఆవలించేది శకుం తల. పైగా ఆవలింతపూర్తి కాకుండానే మధ్యలో మాట్లాడటానికి ప్రయత్నిస్తుం డేది. అలాటప్పుడు ఆవిడ నోటినుండి వెలువడే విచిత్ర ధ్వనులూ, నీటి తుంప రలూ నాకు చికాకు కలిగించేవి. అసలే నాకు ఆవలింతలంటే వళ్ళు మంట. బుద్ధి హీనులనూ, బద్ధకస్తులనూ మాత్రమే ఆవ లింతలు ఆశ్రయిస్తాయని చిన్నతనంనుండీ నా దృఢ విశ్వాసం. మెదడు మొద్దుబారి పోయిన వాళ్ళు బద్ధకస్తులుగా తయా రవుతారనీ, అలాటివాళ్ళే తరచు ఆవ లిస్తుంటారనీ అనుకునే దానిని.

ఐతే శకుంతలే కాదు ఆ కాలేజీలో యించుమించు అందరూ వుదయం పది గంటలనుండి సాయంత్రం మూడున్నర గంటలవరకూ ఏ ఒకటి రెండుగంటలో క్లాసులు తీసుకునేవారు. మిగతా సమయ మంతా కాళ్ళు బార జాపుకుని కూర్చుని కబుర్లాడుకుంటూ, ఆవలించు కుంటూ, కునికి పాట్లు పడుతూ గడిపే వారు.

నన్ను ఏ కారణం వల్లగానీ ఆకర్షిం చిన వ్యక్తులు కొందరున్నారు ఆ కాలేజీలో.

అందులో ఒకామె పేరు పార్వతి. పార్వతి నల్లగా వుండేది. మంచి వడ్డూ పొడుగూ వున్న మనిషి. ఆవిడలో అద్భుతమైన ఆకర్షణ యేదో వుంది. నలుపులో కూడా అందం వుంటుందని నాకు మొదట తెలిసింది ఆవిడ్ని చూసిన తరువాతనే! ఆవిడ ఎప్పుడు చూసినా గల గల నవ్వుతూ, అనర్గళంగా మాట్లాడు తూనే వుంటుంది. నిశ్శబ్దంగా, మౌనంగా ఆవిడ కూర్చోగా నేను ఆ కాలేజీలో పనిచేసిన తొమ్మిది నెలల్లోనూ ఒక్క సారన్నా చూడలేదు. ఆవిడ భర్త పైలట్ ఆఫీసరట. ఏడాది క్రితమే ఆవిడకు వివాహమయింది.

రెండవది సరళ. ఆమె ఏదో మంత్రి గారికి మరదలుట. ఆమె బోటనీ డిపార్టు మెంటుకు అధికారిణి. ఎప్పుడూ పట్టు చీరలలో, రోజుకో కొత్త రకం నగ పెట్టుకుని కాలేజీకి వచ్చేది. సంఘంలో డబ్బువల్ల కానీ, హోదావల్ల గానీ, మరే యితర కారణాలవల్ల గానీ పలుకుబడి వున్న వ్యక్తులతోనే ఆవిడ స్నేహం చేసేది. మిగతా వాళ్ళందరినీ పురుగుల్లా నిర్లక్ష్యంగా చూసేది.

ఓసారి ఆవిడ యింట్లో ఏదో పెద్ద పార్టీ జరిగింది. అందర్నీ పిలుస్తూ నా క్కూడా ఆహ్వాన పత్రిక యిచ్చింది సరళ. ఆవిడతో నేను మాట్లాడటం అదే మొదటిసారి. కార్డు తీసుకుని థాంక్స్ చెప్పి, ఏదో ఒకటి మాట్లాడాలి కదా అని "మీ రుండేది ఎక్కడ?" అని ప్రశ్నించేను.

"బంజారా హిల్స్" అన్నది సరళ.

"నే నెప్పుడూ అటువైపుకు రాలేదు. నాకు తోవ తెలియదు" అన్నాను.

"ఐతే నేను చెప్తానుండండి. మీ రుండేది చిక్కడపల్లి అన్నారు కదూ? నహోజ్ మీ కారు డ్రైవర్ని—"

"సారీ, మాకు కారు లేదండీ!"


"వ్వాట్? మీకు కారు లేదూ?" షాక్ తిన్నట్లు ఒకడుగు వెనక్కి వేసింది సరళ. ఆ క్షణంలో ఆమె ముఖంలో నిల్చిన భావముద్రను ఎన్నటికీ మర్చి పోలేను నేను. బహుశా సిద్ధార్థుడు మొదటిసారిగా కుష్ఠురోగిని చూసినపుడు కూడా ఆయన ముఖం అంత సాను భూతితో, కరుణతో నిండివుండదు.

సరళ నాతో మాట్లాడిన మొదటి సారీ, ఆఖరిసారీ కూడా అదే!

ఐతే అంతటి సరళకి కూడా అవ మానం పొందవలసిన సమయా లుంటా యని మరో రెండు నెలలు గడచేక తెలి సింది నాకు.

ఒకరోజు మధ్యాహ్నం మొదటి పిరి యడ్ సమయంలో ఐదారుగురం తప్ప మిగతా వాళ్ళంతా క్లాసుకు వెళ్ళేరు. వున్నట్టుండి చివ్వున స్టాఫ్ రూమ్‌లోకి దూసుకు వచ్చింది సరళ.

ఆమె వచ్చిన అలికిడికి అందరం ఉలిక్కి పడి తలెత్తేం.




సరళ ముఖం కందగడ్డ లాగయిపోయి వుంది. ఆమె కళ్ళు ఎరుపెక్కివున్నాయ్. ఆ ఎఱుపుదనంలో క్రోధావేశం, దుఃఖం రెండూ మిళితమైవున్నాయ్.

వస్తూనే దభీల్న కుర్చీలో కూలబడింది.

"ఏమిటి సరళా? ఏమయింది? అలాగున్నావేం?" ఆత్రంగా అడిగేరందరూ.

వారి పరామర్శతో క్రోధం ఒకడుగు వెనక్కివేసి, దుఃఖాన్ని ముందుకు తరిమింది, ఆమె కళ్ళలోకి.

"చూడు, సుమిత్రా! అది-దాని కెంత పొగరో!" ఉబికివస్తున్న కళ్ళనీళ్ళను వెనక్కి నెట్టివెయ్యటానికి వ్యర్థప్రయత్నం చేస్తూ అన్నది సరళ.

"ఎవరది? ఏమన్నారు?" ఏక కంఠంతో అడిగేరు, ఎన్నడూ చూడని సరళ కళ్ళ నీళ్ళను చూసి, ఆశ్చర్యపోయిన వాళ్ళంతాను.

"ఇంకెవరు? ఆ మహాంకాళే!" రుమాలుతో ముక్కు తుడుచుకుంది సరళ.

"ఎవరు? ప్రిన్సిపాలా? ఏమన్నదేమిటి?" ఈసారి వారి కంఠాల్లో మరింత ఉత్సాహం కుతూహలం ధ్వనించినయ్.

"నేనుట అసలు హెడ్డుగా వుండటానికి పనికిరానట. నాకు డ్రాఫ్ట్ వ్రాయటం రాదట. డిపార్టుమెంటును కంట్రోల్ చెయ్యటమే తెలియదట నాకు. ఊరికే అరుస్తానుకాని, ఎవ్వరూ, ఆఖరికి

వాళ్లు కూడా; నన్ను లెక్క చెయ్యరట—యివన్నీ ఆవిడ కెవరు చెప్పేరో!" జలజల మంటూ కన్నీరు కార్చేసింది సరళ, యింక నిగ్రహించుకునే శక్తి లేక.

ఒక్క నిమిషం నిశ్శబ్దంగా వుండి పోయే రందరూ—ఆమె ముఖంలోకే చూస్తూ, ఆమె ఏడిచే తీరును పరికిస్తూ.

ఆమె ఏడవటం అయినాక ఒకామె, "ఊరుకో, ఏడవకు. ఆవిడ స్వభావం మనకి తెలియదు గనకనా!" అంది.

ఇంకోకామె, "మొన్నకి మొన్న నేను ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చేనని నిలబెట్టి ఎన్ని మాటలన్నదో! ఛ! ఆవిడకు బొత్తిగా మేనర్సు తెలియవు," అన్నది.

"ముసల్దయి పోయింది గదా! అస్తమానం ఎవరో ఒకరిని ఏదో ఒకటి అనందే నిద్రపట్టదట్టుంది ఆవిడకు. ఇంట్లో కోడల్ని ఎంత రాచి రంపాన పెడ్తుందో!" ఆ అన్నావిడకు కొత్తగా పెళ్ళయింది.

"ఈ ప్రపంచంలో తనొక్కతే ప్రిన్సిపాలుననీ తన హోదాని మించి మరేదీ ఉండదనీ, తన క్రింద పని చేసే వాళ్ళంతా అసలు మనుషులే కాదనీ ఆవిడ ఉద్దేశ్యం!"

"బోడి హోదానూ, అదీ! అంత ముసలి డొక్కయినాక ఆవిడేం ఖర్మ, ఎవరైనా అవుతారు ప్రిన్సిపాలు. అది కూడా ఒక గొప్పేనేమిటి? సీనియారిటీ ఉంటే ఎవడైనా పైకి పోతాడు. మన కంటె పదేళ్ళు ముందు పుట్టినంత మాత్రాన అది కూడా తన ప్రత్యేకతే అనుకుంటే ఎలా?" అన్నదొకామె. ఆవిడ జువాలజీ డిపార్టుమెంటుకు హెడ్డు. ఐతే వయసులో పెద్దవటం వల్ల, మిగతా వాళ్ళకంటె ముందు ఉద్యోగంలో ప్రవేశించిన కారణంవల్ల మాత్రమే డిపార్టుమెంటుకు హెడ్డు అయిన ఆమె తన డిపార్టుమెంటులోని ఉద్యోగస్తు అందరినీ చీటికీమాటికీ, ప్రతి చిన్న విషయానికీ ఎలా పీడించుకు తింటుందో అక్కడున్న వారందరికీ తెలుసు. కాని ఆమెకు మాత్రం ఆ విషయం గుర్తుకు వస్తున్నట్లు లేదు.

వారందరి ఓదార్పు వాక్యాలతో సరళకి ధైర్యం వచ్చింది. పైగా వాళ్ళ ముందు అలా ఏడిచినందుకు, తద్వారా వారి ముందు తేలికై పోయేనేమోనన్న సిగ్గూ, సంకోచం కూడా కలిగినట్లు ఆమె ముఖ కవళికలలో స్పష్టంగా కనిపించ సాగింది.

సరళ రుమాలుతో ముఖం తుడుచు కుంటూ లేచి నిలబడింది. "ఆఁ, యీవిడ మాటలకు నేను బెదుర్తానా? అన్నా నాలుగు మాటలంటుంది తప్ప, నన్నేం చేస్తుందేమిటి? ఇది కాదు, దీన్ని పుట్టించిన బ్రహ్మ కూడా నన్నేమీ చెయ్య లేడు. కాన్ఫిడెన్షియల్ రిపోర్టు వ్రాసే

రోజులు కదా, కాస్త అదరగొడ్దాం జనాన్ని అనుకుంటోంది కాబోలు! ఈవిడకు బెదిరేది ఎవ్వరు? మా బావ మినిస్టరని యీ విడకు తెలియదు కాబోలు. మా అన్నయ్య కూడా వచ్చే ఎన్నికలలో నిలబడుతున్నాడు. తల్చుకుంటే యీవిడ ఉద్యోగాన్నీ, యీ కాలేజీనే పీకేయించగలను నేను...'' తలెగరేస్తూ వెళ్ళిపోయింది సరళ అక్కడ నుండి.

అందరూ ఆమె వెళ్ళిన వైపుకే నిశ్శబ్దంగా చూస్తుండిపోయేరు కాసేపు. ఎంతగా సరళని పైపై వాక్యాలతో ఓదార్చినప్పటికీ ఆవిడకు జరిగిన అవమానానికీ, యింకా చెప్పాలంటే గర్వభంగానికీ, వారంతా మనసారా సంతోషిస్తున్నట్లు వారి ముఖాలు చెప్పక చెప్తున్నయ్.

కాసేపటికి బెల్లవటం, క్లాసులకు వెళ్ళిన వాళ్ళు తిరిగి రావటం, వాళ్ళు ఒక్కొక్కళ్ళే వస్తూనే సరళకి జరిగిన అవమానాన్ని విని ముఖమంతా సంతోషంతో నింపుకోవటం కూడా జరిగింది. పైకిమాత్రం "అరె!సరళని కూడా అంత ఘాటుగా అందా ప్రిన్సిపాలు! నమ్మలేకుండా ఉన్నాను,'' అన్నారు ప్రతి ఒక్కరూను.

శకుంతల కూడా క్లాసు నుండి వస్తూనే డస్టరూ, అటెండెన్సు రిజిష్టరూ టేబులు మీద పడేసి, ఉసూరుమంటూ కుర్చీలో కూలబడింది. "ఏం, అట్లాగున్నారే? వంట్లో బాగా లేదా?'' అనడిగేను నేను.

"ఏం వళ్ళో, ఏం పాడో, రాధా! మా రెండో అమ్మాయికి నిన్నటున్నుండి భేదులు. మూడు నెల్ల క్రితమే పళ్లురావటం మొదలెట్టినాయని చెప్పేను కదూ? మొదట క్రింద పళ్లు రెండూ వచ్చి, అలాగే వుండిపోయినయ్. పెరగనూ లేదు తరగనూ లేదు. మిగతా పళ్ళు కూడా రావటం మానివేసినయ్. ఎందుకో ఏమో అర్థంకావటంలేదు. సరే వున్నట్టుండి నిన్న పదిసార్లు బయటకు పోయింది. ఇవ్వాళ ఉదయమే చూద్దును కదా పై పళ్లు రెండూ వస్తున్నట్లు కనిపించినయ్. వేలు పెట్టి చూస్తే చిగురు గట్టిగావుంది. అందువల్ల పళ్ళవల్లనే యీ విరోచనాలని తేలిపోయింది.

"సరే వాళ్ల అవస్థలు కాక నా అవస్థ ఇంకా అధ్వాన్నంగా వుంది. నే నేమో యిద్దరుపిల్లలుచాలంటే:ఇంకా అబ్బాయి కావాలంటారు మావారు. మా రెండో పిల్ల పుట్టినప్పుడే, 'ఆపరేషన్ చేయించుకుంటానండీ, ఇంకా పనివాళ్ల మీద పిల్లల్ని పడేసి యీ అవస్థలు నేను పడలేనండీ!''అంటూ ఎంతో మొత్తుకున్నాను. ఆయన వింటేనా? అబ్బాయి పుట్టకుండానే ఆపరేషన్ చేయించుకుంటే వాళ్ళ అమ్మా, నాన్నా తనని తిట్టారట. వాళ్ళకి తనొక్కడే కొడుకు. తనకి కనుక

కొడుకు పుట్టకపోతే తన వంశం తన తనతోనే ఆఖరౌతుందని ఆయన బాధ. పోన్లే మూడో ఛాన్సు చూద్దాంలే అని నేనూ ఒప్పుకున్నాను...... వినా నాకు తెలియ కడుగుతాను, రాధా! చదువుకుని అన్నీ తెలిసిన మనమే ఇలా మగపిల్లవాడేదో వంశోద్ధారకుడౌతాడని భావించటం తెలివి తక్కువ తనం కాదూ? ఫూలిష్ సెంటిమెంట్ అవునా, కాదా, నువ్వే చెప్పు.

"సరే, మొదటి పిల్లలిద్దరూ ఎటుపడీ వెంటవెంటనే పుట్టేరు కదా యీసారన్నా కాస్త పిల్లల మధ్య ఎడం ఉండాలని ఫామిలీ ప్లానింగు మొదలెట్టాం. మా రెండోది పుట్టిన దగ్గర నుండి మాత్రలు మింగుతున్నాను. ఆ మాత్రల తీరే అంతో లేక నా వంటి తీరోగాని అవి తింటున్నప్పటినుండీ ఆకలే చచ్చిపోయిందోయ్! వళ్లయితే ఊఁ ఊరి పోతోందేకాని, లోపల శక్తే వుండటం లేదంటే నమ్ము. కూర్చుంటే ఆయాసం, నిల్చుంటే ఆయాసం! వంట్లో వీసమన్నా ఓపిక లేదు, రాధా! ఏ మవస్థలో ఏం పాడో! ఖర్మ!" నుదురు కొట్టుకుంటూ విచారంగా అంది శకుంతల. అంతలోకే ఆవిడలో హాస్యం తలెత్తి చూసింది కాబోలు, "ఇదిగో, రాధా! నువ్వయితే పెళ్లి చేసుకోకమ్మా. అంత కంటె నరకం మరోటుండదు. చూస్తున్నావుగా నా అవస్థలు!" అంటూ భళ్లున నవ్వింది శకుంతల.

నేను నవ్వ తెచ్చుకున్నాను. ఇంతలో ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తున్న చప్పుడైతే వులికిపడి చూసేం యిద్దరం అటువైపుగా.

పార్వతి ఏడుస్తోంది.

నాకు ఎంతో ఆశ్చర్యం వేసింది. ఎన్నడూ చిరునవ్వు చెరగనీయని ముఖంతో కళకళ లాడుతూండే పార్వతి యెందుకు ఏడుస్తోంది?


శకుంతల చటుక్కున లేచి అక్కడకు వెళ్ళింది. పది నిమిషాలపాటు ఆసాంతం ఆమె కథ విని తిరిగి వచ్చింది శకుంతల. వెంటనే నాకు చెప్తే వాళ్ళు చూసి యేమైనా అనుకుంటారని ఏదో పుస్తకం తెరిచి చూస్తూ కూర్చుండిపోయింది. కాని రెండు నిమిషాలకంటె ఎక్కువసేపు ఓపిక పట్టలేకపోయింది శకుంతల.

బల్లమీదకు వంగి నాతో గుసగుసగా చెప్పింది! "పార్వతిని రాత్రి మొగుడు కొట్టేడట!"

"ఏమిటీ?" అదిరి పడ్డాను నేను.

"హుష్! అరవకు. నువ్వొట్టి పిచ్చి పిల్లవు. ఏం తెలియదు" వెనక్కి జరిగి మామూలుగా కూర్చుంది శకుంతల ఒక్క నిముషం.

తరువాత ఓరకంట అటువైపు చూసి వాళ్ళంతా పార్వతిని ఓదార్చటంలో పూర్తిగా నిమగ్నులై వున్నారని నిర్ధారించుకున్న తరువాత మళ్ళా వంగి నాతో అంది: "పార్వతి మొగుడు పైలట్ ఆఫీ




సర్ కదూ? ఈ మధ్య రోజూ రాత్రిళ్లు తాగివస్తున్నాడట ఇంటికి. రాత్రి పార్వతి గట్టిగా నిలదీసి అడిగేసరికి పట్టుకుని తన్నేడట!" అక్కడితో తను చెప్ప దల్చుకున్నది చాలావరకు పూర్తయినట్లు తేలికగా ఊపిరి పీల్చుకుంది శకుంతల.

మరోమారు అటూయిటూ చూసి "అన్నట్టు! ఆయన ఈ మధ్య ఒకఎయిర్ హోస్టెస్‌తో తిరుగుతున్నట్టు ఎవరో చెప్పారట కూడాను!" అంటూ ముగించింది శకుంతల.

నా తల తిరిగిపోయింది. పార్వతిలాటి స్త్రీకి కూడా సాంసారిక బాధలున్నాయంటే యీ కన్నీళ్ళు సృష్టి స్త్రీజాతికి ప్రసాదించిన అపూర్వమైనవరమనీ, అంతస్తుతో, హోదాతో, ఆఖరికి మనస్తత్వంతో కూడా నిమిత్తం లేకుండా యివి స్త్రీని యిట్టే ఆశ్రయిస్తాయనీ అనిపించింది నాకు.

రోజులు గడచిపోతున్నాయ్. అప్పుడే నేను ఉద్యోగంలో చేరి ఆరు నెల లయింది. ఆ ఆరు నెలల ఉద్యోగానుభవం నాకు ఎన్నో పాఠాలు నేర్పింది. తత్ఫలితంగా నా ప్రవర్తనలో, మానసిక స్థితిలో, అభిప్రాయాలలో, ఆశయాలలో ఎన్నో మార్పులు వచ్చినయ్. ఇప్పుడు నేను కూడా ఠీవిగా, గర్వంగా నడవటం, విద్యార్థినుల ముందు గంభీ

రంగా ముఖం పెట్టటం, వాళ్ళు చేసే నమస్కారాలను చూసీ చూడనట్లు నిర్లక్ష్యంగా అంగీకరించటం; ఆడంబరంగా అలంకరించుకోవటం, అర్థరహితమైన సంభాషణలలో పాల్గొనటం మొదలైన విషయాలన్నీ అనాయసంగానే చెయ్యగలుగుతున్నాను. అన్నిటికన్న ముఖ్యమైన విషయమేమంటే, నాకిప్పుడు ఆవలింతలు కూడా వస్తున్నయ్. ఐతే అలా అందవికారంగా, అసభ్యంగా ఆవలిస్తున్నందుకు నేను సిగ్గుపడటం లేదు.

ఇలా వుండగా కాలేజీ వార్షికోత్సవాలు మరో పదిహేను రోజుల్లో ప్రారంభమవబోతాయన్న వార్త చేరింది అందరికీ. ప్రిన్సిపాలు ఆ ఉత్సవాల కార్యక్రమాల్ని నిర్వర్తించేందుకుగాను లెక్చరర్లందరికీ తలా ఒక పనీ అప్పజెప్పింది. నా వంతుకి పార్టీకి కావలసిన తినుబండారాలను తెప్పించే పని యిచ్చింది.

నా కసలే యిలాంటి పనులు కొత్త. ఆ మిఠాయి దుకాణంవాడితో ఎలా మాట్లాడాలో, ఖరీదు ఎలా నిర్ణయించాలో అవేమీ తెలియవు. ఎలాగో శకుంతల సాయంతో, కాలేజీ స్టూడెంట్సు యూనియన్ ప్రెసిడెంటు అయిన సునందను ఆ పనికి నియోగించేను. నేను పని చెప్పగానే సునంద సంతోషంతో అంగీకరించింది.

నిజానికి సునంద అంత త్వరగా నేను చెప్పిన పనిని చేస్తుందని అనుకోలేదు మొదట. ఎందుకంటే, ఆ కాలేజీలో విద్యార్థినులెవరికీ లెక్చరర్ల మీద నిజమైన భక్తి శ్రద్ధలు లేనేలేవు. ఎంతో నిర్లక్ష్యంగా, బాధ్యతారహితంగా ప్రవర్తిస్తుంటారు ఎప్పుడూను. క్లాసులో వాళ్ళు వేసే విజిల్స్, బల్ల దరువులూ, పిల్లికూతలూ, నక్కకూతలూ అన్నీ చూస్తే మగపిల్లలే ఎంతో నయమనిపిస్తుంది. క్రింద లెక్చరర్లు నడుస్తుంటే మేడమీద నున్న విద్యార్థినులు వాళ్ళ నెత్తిమీద గడ్డిపరకలు వెయ్యటం కళ్ళారా చూసిన నేను, ప్రిన్సిపాలు ఆ విద్యార్థినులను ఏ రకంగానూ శిక్షించలేకపోయిందని చూసేక మరింత నిర్ఘాంతపోయేను.

క్లాసులో పూర్తి అటెండెన్సున్న రోజు ఒకటన్నా లేదు. కాలేజీకి వచ్చిన విద్యార్థినులు క్లాసులకు రాకుండా సాయంత్రంవరకు చెట్లనీడలలో కూర్చోవటం, కబుర్లాడుకుంటూ, పాటలు పాడుకుంటూ కాలక్షేపం చెయ్యటం, లేదా దగ్గర్లో వున్న తాజ్ మహల్ హోటల్లో పడి తినటం, అటునుండి అటే సినిమాలకూ, షికార్లకూ పోవటం పరిపాటి. అలాంటి వాళ్ళచేత ఏమన్నా పని చేయించుకోవాలంటే ముందుగా వాళ్ళకేవో మంచి మాటలు చెప్పి, మచ్చిక చేసుకోవాలి. అలాంటి లౌక్యం లేని నాబోటి వాళ్ళు పరువు నిలబెట్టుకోవాలంటే వాళ్ళకు దూరంగా వుండటమే మంచిది.

సరే, సునంద మిఠాయి దుకాణం వాడితో చెప్పి కావలసిన యేర్పాట్లన్నీ చేసుకొచ్చింది. నేను వివరాలడగ సాగేను.

"స్వీట్ అసలు ఖరీదు కిలో పన్నెండు రూపాయలు. బిల్లు పధ్నాలుగుకి వ్రాసిస్తానన్నాడు. పదిహేనుకివ్వమని ఎంతగా అడిగినా లాభం లేదన్నాడు, రాస్కెల్!" అంది సునంద.

"అదేమిటి? ఎంత కిచ్చాడో అంతకే బిల్లు యివ్వమను. ఎక్కువ ఖరీదుకు వ్రాసివ్వమని అడగటమెందుకు?" అన్నాను నేను.

సునంద కళ్లెత్తి చిత్రంగా చూసింది నా వంక; "యింకా నయం, యిప్పటికే చచ్చే లాస్ మనకి అని నే నేడుస్తుంటే, మీ రలాగంటారేమిటి, మేడమ్? ఆ వచ్చే లాభంలో ముగ్గురికీ మూడు రూపాయలొస్తాయిగదా అని నే నాశపడ్తే, వాడలా చేసేడు," అంది సునంద.

"ఎవరా ముగ్గురు?" అన్నాను, అప్పటికి కొంతవరకు విషయాన్ని అర్థం చేసుకోగలిగిన నేను.

"ఇంకెవరు? ప్రిన్సిపాలూ, మీరూ, నేనూ!!' అంటూ నవ్వింది సునంద. "మీరీ యేడే కొత్తగా చేరేరుకదూ? ఏం అనుభవం లేనట్లుంది," అంటూ జాలి పడింది నా మీద.

"ఛ! మన ప్రిన్సిపాలుకి యిలాటి బుద్ధులున్నాయా!" పైకే అనేసేను దాచుకోలేక.

"ఈ ప్రిన్సిపాలేమిటి? ఏ కాలేజిలోనైనా, ఏ ప్రిన్సిపాలైనా అలాగే వుంటుంది, మేడమ్! నాలుగేళ్ళగా స్టూడెంట్స్ యూనియన్ లో ఎక్జిక్యూటివ్ మెంబర్ గా వుంటున్నాను నేను. అన్నీ నాకు తెలుసు. ఐనా యిలాటి విషయాలను సీరియస్ గా తీసుకోకూడదు, మేడమ్!"

నా విద్యార్థిని నాకు సలహా యిస్తోంది.!

నే నింక కోపం పట్టలేకపోయేను. "చూడు, సునందా! నీ వయసు పట్టుమని పద్ధెనిమిది సంవత్సరాలు కూడా లేదు. అప్పుడే యింత లౌక్యం, వ్యాపార బుద్ధీ వంటబట్టించుకున్నావని వింటుంటే నాకే సిగ్గుగా వుంది. నిర్మలంగా, నిష్కపటంగా, ఆదర్శవంతంగా జీవించవలసిన యీ వయసులో ఎంత జాణవైపోయేవు! పోనీ! ఆ ప్రిన్సిపాలంటే పిల్లలు గలావిడ. నేర్చుకోవలసిన వయసు దాటినావిడ. ఆమెను మార్చటం యీ స్థితిలో బ్రహ్మతరం కూడా కాదని సరిపెట్టుకోవచ్చు. కాని నీ సంగతే నాకు చాలా ఆశ్చర్యాన్నీ, బాధనూ కలిగిస్తోంది. అన్యాయాలను ప్రతిఘటిస్తూ, అక్రమాలను ఖండిస్తూ, చైతన్యవంతంగా బ్రతకవలసిన యీ వయసులో యిదేమి బుద్ధి నీకు? యిలా దొంగచాటుగా తీసుకున్న పాతిక, ముప్పై రూపాయలవల్ల నీకు కలిగే మహాలాభం యేమిటి? మూడు రోజుల్లో మాయమయ్యే యీ ముష్టి

డబ్బుకోసం ఆత్మగౌరవాన్ని చంపుకోవటానికి నీకు సిగ్గు వెయ్యటం లేదూ? మీ నాన్నగారు పెద్ద ఆఫీసరు. మీ అమ్మగారు కూడా బాగా చదువుకున్నావిడేనని విన్నాను. ముక్కు పచ్చలారని తమ పిల్లలు యిలాంటి నీచకార్యాలు చేస్తున్నారని వింటే వాళ్ళిద్దరూ బాధపడరా? లేక నువ్వు చేసేది వాళ్ళకు తెలిసి కూడా నిన్ను ప్రోత్సహిస్తున్నారా?" అన్నాను.

నా కోపం చూసి మొదట సునంద కొద్దిగా జంకింది. కాని వెంటనే నవ్వేసింది. "వయసులో మీరు నాకంటె నాలుగైదేళ్ళు పెద్ద అయినప్పటికీ, నాకంటె ఎంతో చిన్నవారిలా మాట్లాడుతున్నారు, మేడమ్! మీకు లోకజ్ఞానం బొత్తిగా తక్కువ. చూస్తుంటే మీకు విద్యార్థిదశలో పాఠం పుస్తకాలు తప్ప మరో ప్రపంచం తెలిసినట్లు లేదు. మనిషి సుఖంగా బ్రతకటానికి కావలసింది తెలివితేటలూ, నేర్పూ. అంతే తప్ప పుస్తకాల్లో నీతి నిజాయితీలు కూడు పెడ్తాయనా మీ వుద్దేశం? అలాంటి ఆదర్శాలన్నీ చదివి అవతల పారేసేందుకు. ఖర్మకాలి మీలా ఉపాధ్యాయ వృత్తిలో చేరితే, మరో నలుగురికి చిలకపలుకుల్లా చెప్పేంతవరకే వాటి ప్రయోజనం. నిజ జీవితంలో వాటిని అమలు పర్చాలంటే ఎన్నో ప్రమాదాలకు గురి కావలసి వస్తుంది; లోకదృష్టిలో చవటలా చలామణి అయ్యే దుస్థితి సంభవిస్తుంది. ఇప్పుడు నేను నిజాయితీగా వుండి రూపాయి వాటా తీసుకోకపోయినా, మీరు కూడా ముట్టుకోనని పట్టుబట్టినా, ప్రిన్సిపాలు ఊరుకుంటుందా? ఆ మూడు రూపాయలూ ఆవిడే తినేస్తుంది. అంటే యీ రకంగా ఆవిడతో సహకరించటం ద్వారా ఆవిడ పాప భారాన్ని కొంత మనం తీసివేస్తున్నామన్నమాట!" అంది.

ఇంక ఆమెతో మాట్లాడటానికే అసహ్యం వేసింది నాకు. ఆ విషవలయాన్నుండి బయట పడేందుకు గాను మర్నాటినుండి వరుసగా నాలుగు రోజులు- వార్షికోత్సవాలు అయిపోయే వరకు-'సిక్ లీవ్' పెట్టి యింట్లో కూర్చున్నాను నేను.


నన్ను కదిలించిన మరో సంఘటన నేను ఆ కాలేజీ నుండి మరో పదిరోజులకు వెళ్ళిపోతాననగా జరిగింది. స్టాఫ్ రూములో కూర్చుని నేనేదో చదువుకుంటున్నాను ఒక మూలగా. రూముకి ఆ చివరన నాకు చాలాదూరంలో నీరజ, కమల కూర్చుని మెల్లగా మాట్లాడుకుంటున్నారు. మిగతా వాళ్ళంతా క్లాసులకు వెళ్ళిపోయారు. ఉన్నట్టుండి కమల, "అతను...అత నిప్పుడేం చేస్తుంటాడో!" అనటం వినిపించి ఉలికిపడ్డాను.

నీరజ, "యీ పాటికి యింగ్లండు చేరుకునే ఉంటాడు కదూ?" అంది.

"ఔను."

"వెళ్ళగానే ఉత్తరం వ్రాస్తాడుగా!"

"ఎవరికి? నాకా? నాకెందుకు




వ్రాస్తాడు? నే నెవర్ని అతనికి? చక్కగా పెళ్ళాం పిల్లలతో కులాసాగా గడిపే వాడికి నేను గుర్తుకొస్తానా? ఏదో మేనమామ కూతురుని కదా అన్న అభిమానంతో ఓ కార్డు ముక్క పడేస్తాడేమో! అయినా నా పేర వ్రాస్తాడన్న నమ్మకమైతే నాకు లేదు-" కమల కంఠం వణికింది చిన్నగా.

కొద్ది క్షణాలు నిశ్శబ్దం.

"ఊరుకో. ఏడవకు. ఈ జన్మలో ఎంత చేసుకున్నామో అంతే అనుభవిస్తాం. అందని విషయాలకోసం బెంగ పెట్టుకోవటం మన తెలివి తక్కువనే సూచిస్తుంది," నీరజ అనునయంగా అంటోంది.

కమల సన్నగా ఏడుస్తున్న శబ్దం విన్నాక యింక పుస్తకం మీదకు దృష్టి పోలేదు నాకు.

వాళ్ళ సంభాషణని బట్టి కమల తన బావను ప్రేమిస్తోందనీ, అతనికి అదివరకే పెళ్ళయిపోయిందనీ అర్థమయింది నాకు. ఆమె బావ ఒక ప్రఖ్యాత జర్నలిస్టు. ఆ సంగతి కాలేజీలో చేరిన కొద్ది రోజుల లోనే తెలిసింది నాకు. కమల వయసు ముప్ఫై పైనే వుంటుంది. ఆమె మధ్య తరగతి సంసారానికి చెందిన స్త్రీ. తండ్రి లేడు. ఆమే యింటికి పెద్ద సంతానం. మిగతా పిల్లలందరినీ కమలే

చదివిస్తోంది. ఈ విషయాలన్నీ దృష్టిలో వుంచుకుని యిప్పటి వాళ్ళ సంభాషణ వింటుంటే నా మనసదోలాగై పోయింది. కమల లాటి స్త్రీలు ఆంధ్రదేశంలో వేల కొలదీ వున్నారు. పూలూ, కాయలూ లేకుండానే ఎండిపోయే మానులు వాళ్ళంతానూ. సతీసహగమనం, కన్యాశుల్కం, బాల్య వివాహాలు, వరకట్నం, కులమత వ్యవస్థ మొదలుగాగల సాంఘిక దురాచారాలు అనాదిగా భారత స్త్రీని ఏదో ఒక రూపంలో చిత్రహింస చేస్తూనే వస్తున్నయ్. ఈ సృష్టిలో అనంతమూ, శాశ్వతమూ అయిన విషయాల్లో స్త్రీలు కార్చే కన్నీరు కూడా ఒకటి!

కొద్ది రోజుల తరవాత నా కా కాలేజీ నుండి ట్రాన్స్‌ఫరయింది. ట్రాన్స్‌ఫర్ ఆర్డర్సు చూస్తూనే నాకు కంగారుతోపాటు, ఆ కాలేజీని విడిచి వెళ్ళవలసినందుకు దిగులు కూడా వేసింది. ఆ కాలేజీలో పనిచేసిన తొమ్మిది నెలల్లోనూ నేను సహించలేని విషయాలు, అసహ్యించుకునే సంఘటనలు ఎన్నో జరిగిన మాట వాస్తవమే! ఐనా ఆ కాలేజీ అంటే నాకు ఏదో చెప్పలేని మమకారం ఏర్పడిపోయింది. ఒక స్త్రీ తన తొలి సంతానాన్నీ, రచయిత తన తొలి రచననూ ప్రేమించినట్లుగా వుద్యోగి కూడా తొలిసారిగా తను పని చేసిన సంస్థను కూడా అలాగే ప్రేమిస్తాడు కాబోలు.

ముఖ్యంగా ఆ కాలేజీ స్టాఫ్ నా కోసం ఏర్పాటు చేసిన వీడ్కోలు విందు సందర్భంలో నాకు కన్నీరాగలేదు. ఆ సమయంలో అక్కడ కూర్చున్న స్త్రీలంతా నా కంటికి ఎంతో అమాయకులుగా, మంచి వాళ్ళుగా కనబడ్డారు. వాళ్ళలోని ఏ బలహీనతలను నే నసహ్యించుకున్నానో అవన్నీ ఎంతో తృణప్రాయంగా కనిపించినయ్ అప్పుడు. డబ్బుకోసం కక్కుర్తిపడే ప్రిన్సిపాలూ, అధికార గర్వంతో విర్రవీగే సరళా, ఆధునిక నాగరికతలోని విశృంఖలతకు లొంగిపోయిన ఫాతిమా, సాంసారిక సమస్యలతో తల్లడిల్లిపోయే శకుంతలా, భర్త ప్రేమకు దూరమైన పార్వతీ, జీవితంలో వసంతానికి నోచుకోని కమలా-అందరూ నా కంటికి ఒకలాగానే కనిపించేరా సమయంలో. వివిధ రూపాల్లో కనిపిస్తున్న వారందరిలోనూ వున్న 'స్త్రీ' ఒకటే! ఏ దేశంలో వున్నా, ఎలాటి హోదాలో వున్నా, అసూయా, అహంభావం, కన్నీళ్ళూ, గుండె జబ్బులూ, కలహప్రియత్వం, అధికార దాహం, అమాయకత్వం, అజ్ఞానం—ఇవన్నీ స్త్రీని జీవితాంతం అంటిపెట్టుకొని వుండే గుణాలని అర్థమయింది నాకు.

బరువెక్కిన హృదయంతో వారందరూ ఎంతో హృదయపూర్వకంగా అందించిన శుభాకాంక్షలను, కన్నీటితో తడిసిన 'బై బై' లను స్వీకరించి ఆ కాలేజీనుండి వచ్చేసేను నేను.